క్లుప్తంగా

రేపు ఆలయ జీర్ణోద్ధరణ



పురాతన బాలాంజనేయస్వామి ఆలయం

వెల్దుర్తి: స్థానిక 1వ వార్డులోని పురాతన బాలాంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులకు ఈనెల 31న భూమి పూజ జరుగనుంది. ఉదయం 8.30 గంటలకు గణపతి పూజతో ప్రారంభమై హోమాలు, కలశ, శంకు స్థాపనలు జరుగనున్నాయి. ఆలయంతో పాటు ఆనుకుని ఉన్న బొడ్రాయి స్థల అభివృద్ధితో కలుపుకుని మొత్తంగా దాదాపు 20 సెంట్ల స్థలంలో భక్తుల విరాళాలతో దాదాపు రూ.కోటి ప్రతిపాదనలతో ఆలయ పునర్నిర్మాణ పనులు శాస్త్రోక్తంగా ప్రారంభం కానున్నాయి. మాజీ ఎంపీపీ బొమ్మన దశరథరామిరెడ్డి గర్భగుడి, మంటపం నిర్మాణానికి అవసరమైన రూ.31లక్షల విరాళాన్ని అందించారు.

వైఎస్సార్‌సీపీ మండల కో కన్వీనర్‌గా లక్ష్మన్న



చిప్పగిరిలో ఎమ్మెల్యే బుసినే విరూపాక్షిని సత్కరించిన దృశ్యం

హొళగుంద: వైఎస్సార్‌సీపీ మండల కో కన్వీనర్‌గా ముద్దటమాగి గ్రామానికి చెందిన లక్ష్మన్నను నియమించారు. గతంలో కో కన్వీనర్‌గా ఉన్న రవిస్వామికి పని ఒత్తిడి ఉండడంతో ఆయన స్థానంలో లక్ష్మన్నకు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అవకాశమిచ్చారని మండల కన్వీనర్ షఫివుల్లా తెలిపారు. తనను నమ్మి పదవి అప్పగించినందుకు ఎమ్మెల్యే, పార్టీ నాయకులు, కార్యకర్తలకు లక్ష్మన్న కృతజ్ఞతలు తెలిపాడు. ఈ మేరకు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి, ఇతర నాయకులను బుధవారం కలిసి సన్మానించారు.

కబ్జాదారుల నుంచి కాపాడండి



తహసీల్దారు రమేష్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ రూరల్ : పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ఉన్న సర్వే నంబర్ 308/3 లోనున్న జట్కా కాలనీ కోసం కేటాయించిన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కబ్జాదారుల నుంచి కాపాడి అర్హులైన పేదలకు ఇవ్వాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ రమేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహేబ్, చేతివృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కారన్న మాట్లాడుతూ విలువైన స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్న ఆక్రమణదారుల నుంచి స్థలాన్ని అధికారులు కాపాడాలని కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు పెద్ద ఈరన్న, పట్టణ సమితి కార్యదర్శి రామాంజినేయులు, నాయకులు నాగిరెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.

31 నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ఆలూరు: మండలంలోని అరికెర గ్రామంలో ఈనెల 31వ.తేదీ నుంచి గ్రామస్తులు, భక్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ మాళ సహిత మల్లేశ్వరస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు ప్రారంభిస్తామని ఆలయ కమిటీ పెద్దలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 31న ఉదయం 101 మంది మహిళలు కళశాలతో ఊరేగింపు, ఫిబ్రవరి 1న ఉదయం గోపూజ,గణపతి పూజ,పుణ్యాహవాచనం, కలశ ప్రతిష్ఠాపన,మహామంగళహారతి తదితర పూజలను నిర్వహిస్తారు. 2న తెల్లవారు జామున శ్రీమాళ సహిత మల్లేశ్వరస్వామి వార్ల విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని హొళగుంద మండలం దేవరగట్టులో కొలువుదీరిన శ్రీ మాళమల్లేశ్వరస్వామి పంచాగ పఠనకర్త, ఆలయ పూజారుల వంశస్తులు గురురవిశాస్త్రి ఆధ్వర్యంలో జరుగుతాయని పేర్కొన్నారు.

ఉరుకుందలో లక్ష పుష్పార్చన

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆధ్వర్యంలో బుధవారం లక్షపుష్పార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు ఈ పూజల్లో పాల్గొని భక్తిని చాటుకున్నారు. ప్రతి అమావాస్యకు ఇలాంటి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఈఓ చెప్పారు. పుష్పార్చన పూజల్లో పాల్గొనలనుకున్న భక్తులు తమ పేర్లను ముందుగానే దేవాలయ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. అమావాస్య కావడంతో భక్తులు తమ ఇంటి ఇలావేల్పును దర్శించుకోవాడానికి మంగళవారం సాయంత్రం నుంచే తరలివచ్చారు. దీంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు.

ఇంకెప్పుడిస్తారు?

- పదిలో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యాశాఖ వందరోజుల ప్రణాళిక
- ఇప్పటి వరకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయని వైనం
- వంద రోజుల్లో మిగిలింది 42 రోజులే..
- స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన ఉపాధ్యాయ సంఘాలు
- వాటితోనే విద్యార్థుల సాధన



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలను సాధించేందుకు విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోంది. అయితే విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ మాత్రం పంపిణీ చేయలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సకాలంలో విద్యార్థులకు మెటీరీయల్ పంపిణీ చేసేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మెటీరీయల్ పంపిణీ చేస్తామన్నా.. ఇప్పటి వరకు విద్యార్థులకు అందలేదు. దీంతో ప్రావీణ్యత కలిగిన ఉపాధ్యాయులు తయారు చేసిన స్టడీ మెటిరీయల్‌ను ఉపాధ్యాయ సంఘాల నాయకులు అయా పాఠశాలల్లో ఉచితంగా పంపిణీ చేసి విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

247 పాఠశాలలు..
18,635 మంది విద్యార్థులు

ఆదోని, పత్తికొండ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 247 ఉన్నాయి. అయా పాఠశాలల్లో 18,635 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. అందులో ఆదోని డివిజన్‌లోని ప్రభుత్వ, ఎయిడెడ్, పురపాలక, గురుకులం, కస్తూర్బా, మోడల్ పాఠశాలల్లో 10,076 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. పత్తికొండ ప్రాంత్రం 6,245 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

గడిచిపోయిన 58 రోజులు ..

మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. పరీక్షలకు రాయడానికి విద్యార్థులకు 42 రోజులు మాత్రమే మిగిలింది. ‘మెరుగైన ఫలితాల సాధన దిశగా వంద రోజులు ప్రణాళిక సిద్ధం చేశాం.. విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ పంపిణీ చేస్తామని’ ప్రభుత్వం పేపర్లలో ఆర్భాటంగా ప్రకటన చేస్తోంది. దీంతో మెటీరియల్ అప్పుడు వస్తుంది... ఇప్పుడు వస్తుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. అయితే వంద రోజుల్లో 58 రోజులు గడిచిపోయాయి, ఇంకా మిగిలింది 42 రోజులు మాత్రమే. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరీక్షలకు రెండు మూడు నేలలకు ముందే విద్యాజ్యోతి పేరుతో ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను రూపొందించి పిల్లలకు పంపిణీ చేసేది. ప్రస్తుత వంద రోజుల ప్రణాళికతో పాటు విద్యార్థులకు అవసరమైన మెటీరీయల్ పంపిణీ చేయాల్సి ఉన్నా ఇంతవరకు అందజేయలేదు. పంపిణీ చేస్తే సగటు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో పాటు మంచి మార్కులను పొందడానికి ఎంతగానో దోహదపడేది.

విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం



పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఉదయం, సాయంత్రం వేళల్లో పత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. వాట్సప్‌లో వచ్చిన పీడీఎఫ్ ఫైల్‌ను డౌన్‌లోడు చేస్తుకొని విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మెటిరీయల్ పంపిణీ చేస్తామన్నారు, కానీ.. ఇంకా రాలేదు. ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు కొంత మంది దాతలు స్పందించి మెటీరియల్‌ను అందించారు.
– వెంకటరమణా రెడ్డి, ఉప విద్యాధికారి, ఆదోని

ఉపాధ్యాయ సంఘాల చేయూత..

ఉపాధ్యాయ సంఘాల నాయకులే దాతల ద్వారా అయా పాఠశాలల్లో ఉచితంగా విద్యార్థులకు స్టడీ మెటిరీయల్‌ను పంపిణీ చేయించారు. ప్రత్యేకంగా రూపొందించిన ఆ స్టడిమెటిరీయల్‌తో పాటు ప్రభుత్వం రూపొందించిన పీడీఎఫ్ ఫైల్‌ను ఉపాధ్యాయులు డౌన్‌లోడు చేసుకొని విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ ప్రణాళిక ప్రకారం ప్రతి రోజూ విద్యార్థులకు అసైన్‌మెంట్స్, మాక్ టెస్టులు పెడుతూ ఉదయం 8.15 నుంచి 9.15 గంటల వరకూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. రోజుకు ఒక సబ్జెక్టు చొప్పున వారంలో 5 సబ్జెక్టులకు బోధన అందించి రివ్యూ చేస్తున్నారు.

నేడు తంగరడోణకు ఎమ్మెల్యే రాక

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామానికి ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి గురువారం రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు బుధవారం తెలిపారు. గ్రామంలో చింతలమునిస్వామి, నల్లారెడ్డి స్వాముల ఆరాధనోత్సవాల్లో పాల్గొని స్వామి వార్లకు పూజలు చేస్తారని చెప్పారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

మద్దికెర : స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు దేవేంద్రప్ప బుధవారం తెలిపారు. బాలికలకు సంరక్షణ కల్పించాలనే ఉద్దేశంతో పూర్వ విద్యార్థి కొండారెడ్డి సీసీ కెమెరాలను విరాళంగా అందజేశారని చెప్పారు. దీంతో వాటిని ఏర్పాట్లు చేయించామన్నారు.

గడ్డివామి దగ్ధం

దేవనకొండ: స్థానిక మూగితాత దర్గా సమీపంలో సరస్వతి విద్యానికేతన్ పాఠశాల వెనక పింజారి రసూల్‌కు చెందిన గడ్డివాముకు బుధవారం నిప్పంటుకోవడంతో పూర్తిగా కాలిపోయింది. గుర్తు తెలియని ఆకతాయిలు నిప్పు అంటించి ఉంటారని బాధితుడు వాపోయారు. గమనించిన స్థానికులు వెంటనే పత్తికొండ అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకునే లోపు గడ్డివాము పూర్తిగా కాలిపోయింది.

సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఏడీఏ సునీత

హాలహర్వి: రైతులు పంటల సాగులో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధిస్తారని ఆలూరు ఏడీఏ సునీత అన్నారు. బుధవారం మండలంలోని హాలహర్వి, బాపురం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రబీలో సాగుచేసిన పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలిచ్చారు. అనంతరం హాలహర్వి రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశమై మాట్లాడారు. ముఖ్యంగా రైతులు ఏటా ఒకే పంట కాకుండా పంట మార్పిడి చేయాలని సూచించారు. పంట మార్పిడి వల్ల సాగుచేసిన పంటలకు ఎలాంటి తెగుళ్ల వ్యాప్తి చెందవని తెలిపారు. సాగు చేసిన పంటలకు రైతులు ఈ– క్రాప్, ఈ–కేవైసీ చేయించుకుంటే పంట నష్టపరిహారం, పంటల బీమా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. ఏఓ శివశంకర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఇంద్రజ, విజయ్ పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు





దేవరగట్టులో ప్రత్యేక అలంకరణలో మాళమల్లేశ్వరస్వామి, అన్నదానం చేస్తున్న దృశ్యం

హొళగుంద: మండలంలోని ఆలయాలు, దర్గాల్లో బుధవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు, ఫాతెహాలు జరిగాయి. దేవరగట్టు క్షేత్రంలో వెలసిన మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో విరాట్ మూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. పూజారులు మూల విరాట్‌కు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సంతర్పణ శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే..హొళగుంద సిద్దేశ్వర స్వామి, సాయిబాబా మందిరం, ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలు, హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, ఫాతెహాలు చేపట్టారు.



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

మద్దికెర : శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి బుధవారం అమావాస్య పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంరించారు. అనంతరం పంచామృతాభిషేకం,కుంకుమార్చన, ఆకుపూజలు, మహా మంగళ హారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

వంతెన ఎన్నటికి పూర్తయ్యేను?

- భారీ వర్షాలకు కొట్టుకుపోయిన చింతకుంట వద్ద కట్రవాగు వంతెన
- ఎనిమిది నెలలుగా నత్తనడకన సరిహద్దు బ్రిడ్జి నిర్మాణం
- ఆంధ్ర, కర్ణాటక గ్రామాల ప్రజలకు తప్పని అవస్థలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



పిల్లర్ల దశలోనే కట్రవంక బ్రిడ్జి పనులు

హాలహర్వి: ఆంధ్ర సరిహద్దు కర్ణాటక చేరుకోవాలంటే మధ్యలో ఉన్న చింతకుంట గ్రామం దాటాల్సి ఉంది. ఈ గ్రామం వద్ద కుట్ర వంకపై ఆంధ్ర, కర్ణాటక సరిహద్దును కలిపేందుకు దీన్ని 1945లో వంతెన నిర్మించారు. అయితే వంతెన పైభాగం శిథిలం కావడం, ఇరుపక్కలా రక్షణ గోడలు లేకపోవడం, ఎత్తు, వెడల్పు, కింద పిల్లర్ల మధ్య దూరం తక్కువగా ఉండటం వంటి కారణాలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇక వరదల సమయంలో కట్రవంక పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో బళ్లారి జిల్లాలోని పలు గ్రామాలకు పూర్తిగా సంబంధాలు తెగిపోయేవి. బ్రిడ్జిని అభివృద్ధి చేసి సమస్య పరిష్కరించాలని రెండు రాష్ట్రాల సమీప గ్రామాల ప్రజలు కోరినప్పటికీ ఐదు దశాబ్దాలుగా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. భారీ వర్షానికి రోడ్డు కొట్టుకపోవడం వల్ల బ్రిడ్జి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వంతెన నేషనల్ హైవే-167 పరిధిలోకి వస్తుంది.

వంతెన నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ చర్యలు..

నియోజకవర్గ ప్రజల ఐదు దశాబ్దాల కలగానే మారిన బ్రిడ్జి నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గత మార్చి నెల వరకు శరవేగంగా సాగిన పనులకు ఎన్నికల కోడ్‌తో అంతరాయం ఏర్పడింది. కొత్త ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణాన్ని పట్టించుకోకపోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. బ్రిడ్జి లేకపోవడంతో ఈ మార్గంలో భారీ వాహనాలు తిరిగే అవకాశం లేకుండా పోయింది. అయితే.. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే విరూపాక్షి పోరాటంతో పనులు మళ్లీ చేపట్టినప్పటికీ నత్తను తలపిస్తున్నాయి. క్షేత్రగుడి, మోకా గ్రామాల మీదుగా బళ్లారికి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నత్తనడకన సాగుతున్న కట్రవంక బ్రిడ్జి నిర్మాణ పనులు

పంట దిగుబడులు తెచ్చుకోలేకపోతున్నాం..



బ్రిడ్జి పనులు పూర్తయితే రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయి. గ్రామానికి చెందిన చాలామంది రైతుల పొలాలు బ్రిడ్జి అవతల ఉన్నాయి. వర్షం వస్తే వంక దాటి అవతలికి వెళ్లలేని పరిస్థితి. ప్రస్తుతం వంతెన లేకపోవడంతో దిగుబడులు తెచ్చుకోవడానికి అవస్థలు పడుతున్నాం. – ప్రసాద్, చింతకుంట

ఉపాధి పనుల తనిఖీ

తుగ్గలి : మండల కేంద్రం సమీపంలో చేపట్టిన ఉపాధి పనులను బుధవారం ఎంపీడీఓ విశ్వమోహన్ తనిఖీ చేశారు. పని ప్రదేశంలో మస్టర్లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. మస్టర్లలో బినామీ పేర్లు చేర్చకుండా కూలీలు చూసుకోవాలన్నారు. బినామీ పేర్లు చేర్చడం వల్ల పనిచేసిన నిజమైన కూలీలకు నష్టం జరుగుతుందని చెప్పారు. పనులు పారదర్శకంగా చేపట్టాలని కూలీలకు సూచించారు.

- ఆస్పరి: మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ గీతావాణి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీల మస్టర్లను పరిశీలించి వలసలు వెళ్లకుండా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

కృష్ణగిరి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పంట రుణాలు తీసుకున్న రైతులు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని సొసైటీ సీఈఓ శివన్న కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సొసైటీలో రైతు నేస్తం, రాజన్న చేయూత కింద పంట రుణాలు తీసుకున్న రైతులు మార్చి 25వ తేదీలోగా వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని తెలిపారు. రెన్యూవల్ చేయకపోతే నోటీసు ఇచ్చి అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు తమ బకాయిలను మార్చి 31 లోగా కంతుల వారీగా చెల్లించాలని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచండి

ఆలూరు: ఆలూరు పోలీసు సర్కిల్ కార్యాలయం పరిధిలోని ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాల్లో అల్లర్లు సృష్టించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా వేసి చర్యలు తీసుకోవాలని ఆలూరు సీఐ వెంకటచలపతి ఆదేశించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలను నడిపితే కేసు నమోదుతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తామన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. ఇక నుంచి ఉరుసులు, దేవర్లు నిర్వహించే వారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

హొళగుంద: మండలంలోని కోగిలతోట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ కూడ్లూరు దేవన్న (40) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బుధవారం బళ్లారి హాస్పిటల్‌లో కోలుకోలేక మృతి చెందాడు. పది రోజుల క్రితం గుత్తి వద్ద రోడ్డు పై ఉంచిన డ్రమ్ములను ఢీకొట్టి తీవ్రంగా గాయపడిన దేవన్న కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండేవాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో నాలుగు రోజుల క్రితం బళ్లారి పెద్దాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య గంగమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతి విషయం తెలుసుకుని ఎమ్మెల్యే సోదరుడు బుసినే శ్రీరాములు, పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామానికి చేరుకుని దేవన్న మృతికి నివాళలర్పించి కుటుంభ సభ్యులను ఓదార్చారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు



వ్యాపారులతో మాట్లాడుతున్న డీపీఓ భాస్కర్

మద్దికెర : ప్రభుత్వ స్థలాలు ఎవరు ఆక్రమించినా నిర్మాణాలను సైతం కూల్చివేస్తామని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారనే ఫిర్యాదు మేరకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ అధికారుల అనుమతి మేరకే కట్టడాలు చేపట్టాలని, అంతేగాని ఇష్టానుసారంగా చేస్తే కూల్చివేసి పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం ఇటీవల నాబార్డు నిధులతో నిర్మించిన మార్కెట్ సముదాయం, పంచాయతీ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. డీఎల్‌పీఓ వీరభద్రప్ప, తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, సర్పంచ్ సుహాసిని, ఈఓ శివకుమార్ ఉన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ప్రదీప్

కృష్ణగిరి: మాదక ద్రవ్యాల బారిన పడితే జీవితాలు నాశనమవుతాయని వైద్యాధికారి ప్రదీప్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ బుధవారం మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే నష్టాలపై హెచ్‌ఎం కల్పన ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుట్కా, బీడీ, సిగరెట్, గంజాయి,మద్యం, హెరాయిన్ వంటివి తీసుకోవడం వల్ల మానసికంగా, శారీరకంగా నష్టపోతారన్నారు. భవిష్యత్ బాగుండాలంటే మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఎంపీహెచ్‌ఈఓ గజేంద్రారెడ్డి, పీహెచ్‌ఎన్ అలివేలమ్మ, ఉపాధ్యాయులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.





క్షేత్రగుడి-బళ్లారికి వెళ్లే రహదారిలో ఏర్పడిన గుంతలు

సరిహద్దు రోడ్లు.. పట్టించుకునేదెవరు?



క్షేత్రగుడి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో చెక్‌పోస్టు వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

హాలహర్వి: మండలంలోని రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో నిత్యం ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. క్షేత్రగుడి ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు వరకు బళ్లారికి వెళ్లే జాతీయ రహదారి గుంతలమయంగా మారింది. అలాగే కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, మోకా తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికులు క్షేత్రగుడి ఆంజనేయస్వామి ఆలయానికి, గూళ్యం గాదిలింగేశ్వరస్వామి, దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి, ఎల్లార్తి షేక్షావలి దర్గా, మంత్రాలయం రాఘవేంద్రస్వామి, ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయాలకు ఈ రహదారుల గుండానే వెళ్లాలి. దీంతో నిత్యం ఈ రహదారి వాహనాలతో రద్దీగా ఉంటోంది. రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సరిహద్దు ప్రాంతాల రోడ్లు కావడంతో పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు, ప్రయాణికులు వాపోతున్నారు.



క్షేత్రగుడి-బళ్లారికి వెళ్లే రహదారి దుస్థితి

లీకేజీతో వృథా..



ములుగుందంలో మంచి నీటి పైపు లైన్‌కు లీకై రోడ్డుపై పారుతున్న నీరు,

నీటి కోసం వ్యథ



మినీ ట్యాంకు దగ్గర నీటి కోసం వేచి ఉన్న గ్రామస్తులు

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో మంచి నీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి నీరు ప్రధాన రోడ్డుపై వృథాగా పారిపోతోంది. దీంతో గ్రామంలో మంచి నీటి సమస్య నెలకొంది. పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి 15రోజులు అవుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో నీటి సమస్య తీవ్రమైంది. గ్రామానికి 4 బోర్లు ఉన్నప్పటికీ.. మూడు బోర్ల నుంచి ఫ్లోరైడ్ నీరు వస్తుండటంతో వాటిని సాధారణ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. మంచి నీరు వచ్చే బోరు పైపు లైన్‌కు లీకేజీ ఏర్పడింది. చిన్నపాటి మరమ్మతులు చేయాల్సి ఉన్నప్పటికీ స్పందించకపోవడంతో నీరు రోడ్డుపై వృథా పారిపోతోంది.

నీటి లభ్యత తక్కువవడంతో కుళాయిలు, ట్యాంకుల వద్ద జనం బిందెలతో బారులుదీరుతున్నారు. గంటల తరబడి నిరీక్షించి తెచ్చుకోవాల్సి వస్తోంది.